సాక్షి
మెదక్
ఆదివారం | 29 | జనవరి | 2023



రైతును వేధిస్తున్న 'మొగిపురుగు'

వరి పైరుకు సోకుతున్న మొగి పురుగుతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గుర్తించిన వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 8లో



కారు టైరు మారుస్తుండగా..

కారు టైరు మారుస్తుండగా వెనుక నుంచి వచ్చిన ఓ గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. 8లో



ఆగుతూ.. సాగుతూ

నర్సాపూర్‌లో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం ప్రారంభమై ఐదేళ్లు అవుతున్నా పూర్తి కావడం లేదు. ఎప్పుడు పూర్తి అవుతాయో అని అబ్దిదారులు ఎదురుచూస్తున్నారు. 9లో

న్యూస్‌రీల్

సాలోజిపల్లి కార్డెన్ సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండల పరిధిలోని సాలోజిపల్లి గ్రామంలో శనివారం ఎస్పీ రోహిణీప్రియదర్శిని ఆదేశాల మేరకు పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 16 ద్విచక్ర వాహనాలు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అల్లాదుర్గం సీఐ జార్జ్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలు కొనుగోలు చేయొద్దని తెలిపారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు తిరిగితే తమకు సమాచారం ఇవ్వాలని, వ్యక్తిగత సమాచారం తెలియని వారికి ఇవ్వొద్దని తెలిపారు. కార్యక్రమంలో టేక్మాల్ ఎస్సై లింగం, రేగోడ్ ఎస్ఐ సత్యనారాయణ, పెద్దశంకరంపేట బాలరాజు, అల్లాదుర్గం ప్రవీణ్ రెడ్డి పోలీస్, గ్రామ సర్పంచ్ హర్షబేగం, ఉప సర్పంచ్ దుర్గేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలి

ఎస్పీ రోహిణీప్రియదర్శిని



మాట్లాడుతున్న ఎస్పీ రోహిణీప్రియదర్శిని

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజలకు పోలీసులు జవాబుదారీగా పనిచేయాలని ఎస్పీ రోహిణీప్రియదర్శిని అన్నారు. శనివారం పేట పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా పూర్వకంగా వ్యవహరించాలన్నారు. సమస్యలను ఓపికతో విని పరిష్కరించాలన్నారు. ఆన్‌లైన్ విధానంపై అవగాహన కల్పించాలి, ప్రతీ పిటిషన్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. డయల్ 100కు వచ్చిన కాల్స్‌కు స్పందించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జాతీయ రహదారిపై ప్రజలు నిబంధనలను పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. కార్యక్రమంలో అల్లాదుర్గం సీఐ జార్జ్, పేట ఎస్ఐ బాలరాజు, ఏఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాలతో పెరగనున్న ఆధ్యాత్మికత



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎలక్షన్‌రెడ్డి, గ్రామస్తులు

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాల్లో ఆలయాల నిర్మాణంతో ఆయా పరిసరాలు ఆధ్యాత్మికత పెరుగుతుందని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి అన్నారు. శనివారం మనోహరాబాద్ మండలంలోని రామాయపల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ ఆలయ నిర్మాణం కోసం గ్రామస్తులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరిలో ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతీమల్లేశ్, ఉప సర్పంచ్ వెంకటేశ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రతన్‌లాల్, నాయకులు నాగేందర్‌రెడ్డి, సత్యనారాయణ, ఆసిఫ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెంచిన రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలి

మెదక్ కలెక్టరేట్: ఎస్టీలకు జీఓ 33 ప్రకారం పెంచిన 10 శాతం రిజర్వేషన్‌ను అన్ని ప్రభుత్వ శాఖల్లో అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తారాసింగ్, చదల్ భాస్కర్‌లు మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులు, విద్య సంబంధించిన వివిధ రిక్రూట్‌మెంట్‌లు, ఖాళీల భర్తీ, ప్రమోషన్స్‌లలో ఎస్టీలకు తప్పనిసరి ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం పెంచిన 10 శాతం రిజర్వేషన్లు అన్ని శాఖలలో అమలయ్యేలా చూడాలని కోరినట్లు తెలిపారు.

వేసవి.. చర్యలేవీ?

అడవులకు పొంచి ఉన్న ప్రమాదం

- చెట్లకు రాలుతున్న ఆకులు
- నేటికీ ఏర్పాటు కాని ఫైర్‌లైన్స్ విధానం
- నిప్పంటుకుంటే అడవులు బుగ్గయ్యే అవకాశం
- నిధులు విడుదల కాలేదంటున్న అధికారులు

మెదక్‌జోన్ : వేసవిలో అగ్నిప్రమాదాల నుంచి వనాలను రక్షించడానికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అగ్ని ప్రమాదాలు నివారించడానికి ఫైర్‌లైన్‌లను ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఇంత వరకు చేయలేదు. రానున్నది వేసవి కాలం కావడంతో ఉష్ణోగ్రతలు పెరుగనున్నాయి. ప్రస్తుతం కొడుతున్న ఎండలకు రోడ్లకు ఇరువైపులా ఆకులు రాలిపోయాయి. రహదారుల వెంట వెళ్లే వారు చుట్టా, బీడీ కాల్చివేస్తే అడవి మొత్తం కాలిపోయే అవకాశం ఉంది. నష్టం నివారించడానికి అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

- జిల్లాలోని 21 మండలాలు ఉండగా 18 మండలాల పరిధిలో అడవులు విస్తరించి ఉన్నాయి. జిల్లాలో మొత్తం అడవులు 58,186 హెక్టార్ల అడవులు ఉన్నాయి. ఒక్క హెక్టార్‌కు రెండున్నల ఎకరాలు కాగా మొత్తం 145 ఎకరాలు ఉన్నాయి.
- అడవుల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిఏటా చర్యలు చేపడుతాయి. జనవరి మొదటి వారంలోనే ఫైర్ లైన్స్ కోసం నిధులు విడుదల చేస్తాయి. కానీ ఈ సంవత్సరం ఇంకా ఫైర్‌లైన్స్ కోసం పైసా విడుదల చేయలేదు.
- ప్రస్తుతం జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 34 డిగ్రీల మేర నమోదు అవుతున్నాయి. మధ్యాహ్నం వేళలో ఎండ వేడిమికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చెట్లకు ఉన్న ఆకు అంతా ఎండిపోయి రాలిపోతుంది.



మెదక్-రామాయంపేట రహదారి పక్కన రాలిన ఆకులు

- ప్రధానంగా మెదక్–రామాయంపేట, మెదక్–బోధన్, మెదక్–నర్సాపూర్, మెదక్–రాజిపేట తదిత మండలాల్లో అడవులు పెద్ద ఎత్తున విస్తరించి ఉన్నాయి.
- రోడ్ల వెంట వెళ్లే ప్రయాణికులు బీడీ, చుట్టా, సిగరేట్ కాల్చి వేస్తే అడవి తగులబడే ప్రమాదం ఉంది. గతంలో ఇలాంటి ఘటనలు జిల్లాలో చాలానే ఉన్నాయి.
- గతేడాది 80 కిలో మీటర్ల మేర అడవుల్లోని రహదారుల వెంట క్రియేషన్ రహదారులకు ఇరువైపులా రూ. 7.26 లక్షలు ఖర్చు చేసి ఫైర్‌లైన్స్ కొట్టించారు.
- 95 కిలో మీటర్ల మేర మెయిన్‌టనెన్స్ అడవుల్లోని రహదారుల వెంట రూ.6.51 లక్షలు ఖర్చు చేసి ఫైర్‌లైన్ కొట్టించారు. ఇది ప్రతిఏటా తప్పనిసరి చేయాలి.
- అడవుల సంరక్షణకు ప్రత్యేక నిధులు మంజూరి అవుతాయి. వాటితో ముందుగా ఫైర్‌లైన్ కొట్టించి అనంతరం జంతువులకు తాగునీటి కోసం సాసర్ ఫీట్ల నిర్మాణాలు, చెక్‌డ్యాంల నిర్మాణాలతోపాటు ఇప్పటికే నిర్మించిన సాసర్ ఫీట్లలో జంతువుల దాహం తీర్చేందుకు నీటిని నింపుతారు.
- ఈసారి జిల్లాలో ఫైర్‌లైన్ పనులు చేపట్టకపోవడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

ఫైర్‌లైన్ అంటే..

- అటవీ ప్రాంతాల్లో ఎడ్లబండ్ల తొవ్వలు, కాలినడకలకు ఇరువైపులా ఎండిన ఆకులను ఒక దగ్గర పోగు చేస్తారు.
- పోగు చేసిన ఆకునంతా నిప్పు పెట్టి కాలుస్తారు. ఫలితంగా దారి వెంట ఎవరైన బీడీ కోసం నిప్పంటించుకొని పడేస్తే కాలిపోయే అవకాశం ఉండదు.
- అందుకే ఎప్పటికప్పుడూ దారులపై ఎండిన ఆకులను ఉండకుండా చూస్తారు. ప్రమాదవశాత్తు నిప్పంటినా ఈ దారుల వరకే వ్యాపించి ఆగుతుంది.

నిధులు విడుదల కాలేదు



ప్రతీఏటా ఫైర్‌లైన్స్ విధానం అమలు చేయడానికి ముందస్తుగానే నిధులు విడుదలయ్యేవి. కాగా ఇప్పటి వరకు విడుదల కాలేదు. ఎండలు ముదరడంతో అడవిలోని ఆకులు రాలిపోతున్నాయి. నిధులకోసం ఉన్నతాధికారులకు నివేదికను అందించాం.

– రవిప్రసాద్, డీఎఫ్ఓ,మెదక్

అదనపు కలెక్టర్ రమేశ్‌కు సన్మానం

మెదక్ కలెక్టరేట్: జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు శనివారం అదనపు కలెక్టర్ రమేశ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య సభ్యులు మాట్లాడుతూ.. మంజీరా మెదక్ ఉత్పత్తుల ప్రారంభోత్సవం కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన హామీ మేరకు జిల్లా మహిళా సమాఖ్య నిర్మాణానికి స్థలం కేటాయించారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావుకు, కలెక్టర్ హరీశ్, అదనపు కలెక్టర్ రమేశ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అదనపు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఇందులో భాగంగా అదనపు కలెక్టర్ రమేశ్‌ను జిల్లా సమాఖ్య కార్యవర్గం సభ్యులు కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షులు నవనీత, కార్యదర్శి లక్ష్మీనర్సమ్మ, ఉపాధ్యక్షురాలు అనిత, సహాయ కార్యదర్శి తులసి, డీపీఎం మోహన్, సురేశ్, వినోద్ జిల్లా సమాఖ్య సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రమేశ్‌ను సన్మానిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

పైరవీ బదిలీలు ఆపాలి



ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

- జీరో సర్వీసు బదిలీలకు అనుమతి ఇవ్వండి
- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు ఉపాధ్యాయ సంఘాల వినతి

మెదక్ కలెక్టరేట్: ఉపాధ్యాయ బదిలీలో పైరవీలు జోరుగా జరుగుతున్నాయని, అక్రమ బదిలీలకు అడ్డుకట్ట వేసి జీరో సర్వీసు బదిలీలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ పలు ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం మెదక్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు ఉపాధ్యాయల సంఘాల నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియను అపహాస్యం చేస్తూ, రాజకీయ పలుకుబడితో చేస్తున్న వందలాది పైరవీ బదిలీలు నిలుపుదల చేయాలన్నారు. బదిలీల్లో కనీస సర్వీసు నిబంధనను తొలగించాలన్నారు. మిగిలిన ఎస్జీటీ, ఎల్పీ స్పౌజ్ బదిలీలను నిర్వహించాలన్నారు. 317లో బలవంతంగా బదిలీ చేసిన వారిని స్థానిక జిల్లాలకు పంపాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ సానుకూల స్పందన లేదన్నారు. ఏ విధమైన అక్రమాలకు తావులేకుండా బదిలీలు పారదర్శకంగా జరపాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్, పీఆర్టీయూటీఎస్, టీఎస్ యూటీఎఫ్ నాయకులు సంగయ్య, వెంకట్ రామ్ రెడ్డి, పద్మారావు, శ్రీనివాస్ రావు, పద్మారావు , అజయ్ కుమార్, నజీరొద్దీన్, సబ్బని శ్రీనివాస్, సుంకరి కృష్ణ, లింబేష్, అనీల్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

డీపీఓ సాయిబాబా



అండర్ డ్రైనేజీని పరిశీలిస్తున్న సాయిబాబా

మనోహరాబాద్(తూప్రాన్): పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పని చేయాలని డీపీఓ సాయిబాబా సూచించారు. శనివారం డీపీఓ మనోహరాబాద్ మండలంలోని కోనాయపల్లి(పీటీ) గ్రామా న్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ వీధులు, అండర్ డ్రైనేజీ, నర్సరీ, ప్రకృతి వనం, డంప్ యార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కోనాయపల్లి(పీటీ), జీడిపల్లి, వెంకటాపూర్ అగ్రహా రం గ్రామాల్లో ఇంటి పన్నులు 100 శాతం పూర్తి చేసినందుకు కార్యదర్శులు నవీన్‌కుమార్, సునంద, సత్యనారాయణలను అభినందించారు. అనంతరం డీపీఓను మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మీనర్సయ్య, కార్యదర్శి నవీన్‌కుమార్, భాను, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుమల స్వామి కల్యాణం



స్వామివారిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

- జనసంద్రమైన ఆలయం
- అట్టహాసంగా బండ్ల ఊరేగింపు
- హాజరైన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దంపతులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో శ్రీ తిరుమల స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. వేడుకకు ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి దంపతులు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం బండ్ల ఉరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. స్వామి కల్యాణానికి విచ్చేసిన భక్తులకు, అధికారులకు, పాలకవర్గానికి రథసప్తమి శుభాకాంక్షలు తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. తిరుమల స్వామి దేవాలయం అభివృద్ధి కృషి చేస్తామన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను డీఎస్పీ యాదగిరి రెడ్డి, సీఐ చంద్రశేఖర్ రెడ్డి, రామాయంపేట సర్కిల్ ఎస్ఐలు పర్యవేక్షించారు. జాతరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ, స్థానిక సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ బాల్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల మహేశ్, దేవాలయ ఈఓ మోహన్ రెడ్డి, శ్యామ్ రాజు, తిర్మలయ్య, గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



స్వామి వారి కల్యాణంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దంపతులు

చట్టాలపై అవగాహన తప్పనిసరి

- నర్సాపూర్ మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి అనిత

నర్సాపూర్ రూరల్: ప్రతీ ఒక్కరికి చట్టాలపై అవగాహన అవసరమని నర్సాపూర్ మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి అనిత అన్నారు. నర్సాపూర్ మండలం నారాయణపూర్ గిరిజన గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో న్యాయ విజ్ఞాన విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సుకు హాజరైన న్యాయమూర్తి అనిత మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని దృష్టిలో పెట్టుకొని కష్టపడి చదువుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, పిల్లల హక్కులు, సైబర్ నేరాలపై వివరించారు. భాష పరిజ్ఞానాన్ని పెంచుకొని నేటి సమాజం పోకడలపై సందేశాత్మక విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, న్యాయవాదులు మధుశ్రీ,, స్వరూప, రాణి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి అనిత

భూమికి బదులు భూమి ఇవ్వండి

- రత్నాపూర్ గ్రామస్తుల డిమాండ్
- ట్రిపుల్‌ఆర్ సర్వేపై అధికారుల అవగాహన సదస్సు

శివ్వంపేట(నర్సాపూర్) : ట్రిపుల్‌ఆర్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమి ఇవ్వాలని మండల పరిధిలోని రత్నాపూర్ గ్రామ రైతులు డిమాండ్ చేశారు. రోడ్డుకు సంబంధించి శనివారం రెవెన్యూ సిబ్బంది గ్రామంలోని రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలని లేదా భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిన్న, సన్నకారు రైతుల భూములు కోల్పోతున్నారని తహసీల్దార్ శ్రీనివాస్‌చారితో ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు పీసీసీ అధికార ప్రతినిధి రెడ్డిపల్లి ఆంజనేయులుగౌడ్ సంఘీభావం తెలిపారు. పెద్ద రైతుల భూముల జోలికి వెళ్లకుండా పేద రైతుల భూములు తీసుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకుల కనుసైగలతో ఇష్టారాజ్యంగా సర్వే చేస్తున్నారని అన్నారు. ప్రస్తుత అలైన్మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. పక్కనే ఉన్న అసైన్డ్ భూముల్లో నుంచి ట్రిపుల్‌ఆర్ రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పేద, సన్నకారు రైతులకు నష్టం జరగకుండా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీటీసీ వాణి రాంమోహన్‌రెడ్డి, సర్పంచ్ బొగ్గుల సాలమ్మ అన్నారు. రైతులు లేవనెత్తిన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ తెలిపారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

రోడ్డెక్కిన హాస్టల్ విద్యార్థులు

- సమస్యలు పరిష్కరించాలని రాస్తారోకో
- మద్దతు తెలిపిన ఎస్ఎఫ్ఐ, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆంజనేయులు



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, నాయకులు

మెదక్ రూరల్: హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేసిన ఘటన హవేలిఘనపూర్ మండలం బూరుగుపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీసీ హాస్టల్ విద్యార్థులు ప్లేట్లతో బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. సుమారు గంటకు పైగా కొనసాగిన విద్యార్థుల ఆందోళనకు ఎస్ఎఫ్ఐ, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు మద్దతు తెలిపారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. బీసీ హాస్టల్‌లో కనీస మౌలిక వసతులు కల్పించడం లేదని, వార్డెన్ ప్రవర్తన అసభ్యకరంగా ఉందని విద్యార్థులు ఆరోపించారు. నాణ్యత లేని భోజనం పెడుతున్నారని, ట్యాంక్‌ను శుభ్రం చేయకపోవడంతో పాకురుపట్టిందని, కలుషిత నీటిని తాగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గది తలుపులకు బోల్ట్స్ లేకపోవడంతో పెట్టెలను అడ్డంపెట్టుకొని భయంగా నిద్రిస్తున్నట్లు తెలిపారు. హాస్టల్‌లో పనిచేసే సిబ్బంది సైతం సిగరెట్లు, బీడీలు తాగి పడేయడంతో పాటు తమను ఏదో ఒక సాకుతో కొడుతున్నారని తెలిపారు. వెంటనే హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ లేదా బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

హాస్టల్ సందర్శన...

ఈ విషయం తెలుసుకున్న బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి కేశరాం, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి నాగరాజుగౌడ్ బూరుగుపల్లి హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పరిసరాలను పరిశీలించారు. వార్డెన్ సుధాకర్‌రెడ్డి పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే టీపీసీసీ సభ్యుడు మామిళ్ల ఆంజనేయులు హాస్టల్‌ను సందర్శించి ప్రభుత్వ తీరు, అధికారుల వ్యవహారశైలిపై మండిపడ్డారు. బీజేపీ మండల అధ్యక్షుడు రంజిత్ రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ స్పందించి అసాంఘీక కార్యకలాపాలకు హాస్టల్‌ను అడ్డాగా మార్చిన వార్డెన్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయకార్యదర్శి అజయ్ మాట్లాడుతూ హాస్టళ్లను పర్యవేక్షించకుండా, విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారిపై, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్‌లపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నవీన్ అక్కడికి చేరుకొని వార్డెన్ పై చర్యలు తీసుకొని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

కేతకిలో దరియాపూర్ జడ్జి పూజలు



కేతకిలో ఆలయంలో జడ్జి తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయాన్ని మహారాష్ట్రలోని అమరావతి జిల్లా దరియాపూర్ సివిల్ కోర్టు జడ్జి ఓం శంకర్ పాటిల్ శనివారం సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పార్వతీ పరమేశ్వరులకు జడ్జి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

పెయింటర్ ఆత్మహత్య

హుస్నాబాద్: పట్టణానికి చెందిన పెయింటర్ ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం పట్టణ శివారులోని మహ్మదాపూర్ రహదారి సమీప మామిడి తోటలోని చెట్టుకు ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకున్న గడ్డం ప్రవీణ్ (22) పట్టణంలోని కేబీ కాలనీ వాసిగా గుర్తించారు. మృతుడు పెయింటింగ్ పని చేస్తుంటాడనిని స్థానికులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీస్‌లు దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బంగారు నగల కోసం వృద్ధురాలి హత్య

మెదక్ జిల్లా చిన్నశంకరంపేటలో ఘటన



వృద్ధురాలి వివరాలు సేకరిస్తున్న పోలీస్‌లు

చిన్నశంకరంపేట(మెదక్): బంగారు నగల కోసం వృద్ధురాలిని ఓ వ్యక్తి హత్య చేశాడు. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. రామాయంపేట సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చందంపేటకు చెందిన వడియారం ఎల్లమ్మ(70) ఇంటి ఆవరణలో కూర్చొని ఉంది. ఒంటరిగా ఉన్న ఆమెను ఇంటి పక్కనే ఉంటున్న మేకల సిద్దిరాములు నమ్మించి శిథిలమైన అతడి పాత ఇంట్లోకి తీసుకెళ్లి హత్య చేశాడు. ఆమె మెడలోని బంగారు గుండ్లు, చెవి కమ్మలు దొంగలించాడు. కాగా వృద్ధురాలు కనిపించకపోవడంతో ఆరాతీయగా సిద్దిరాములు తీసుకెళ్లాడని స్థానికులు తెలిపారు. గ్రామస్తులను చూసి నిందితుడు పరారయ్యాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. వృద్ధురాలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వృద్ధురాలి బంగారాన్ని దొంగిలించేందుకు సిద్దిరాములు హత్య చేశాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

రైతును వేధిస్తున్న 'మొగిపురుగు'

- వరి పంటను ఆశిస్తున్న ఫైనం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- సమాచారం ఇవ్వాలంటున్న అధికారులు



జిన్నారంలో మొగిపురుగు ఆశించి పాడైన వరి పంట

జిన్నారం(పటాన్‌చెరు): రైతులకు మొగిపురుగు (కాండం తొలిచే పురుగు)ఓ శాపంలా మారింది. ప్రస్తుతం వరి పంటకు అధికంగా మొగి పురుగు ఆశిస్తోంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు కూడా వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు చేప ట్టారు.

- జిన్నారం మండలంలో 2500 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేస్తుంటారు. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో 1600 మంది వరినాట్లు వేశారు.
- గుమ్మడిదల మండలంలో 4 వేల ఎకరాల్లో సాగు చేస్తుంటారు. ప్రస్తుత సీజన్‌లో 2500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.
- రైతులు వరి నాట్లను వేసి పదిరోజులు గడిచింది. ప్రస్తుతం వరి పంటకు అధికంగా మొగిపురుగు ఆశిస్తోంది.
- వరి పైరు ఎర్రగా మారుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.
- ఈ సమస్యను పరిష్కరించేలా వ్యవసాయశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

కారణాలు

- పంట మార్పిడి లేకపోవటం వల్ల పంటలకు వ్యాధులు సోకుతున్నాయి.
- ప్రస్తుత వాతావరణ మార్పులు కూడా ఈ పురుగు ఆశించడమే కారణం.
- నారుమడి(తుకం)పై భాగాన్ని తుంచాల్సి ఉంటుంది. సస్యరక్షణ చేపట్టకుండా యూరియా వినియోగిస్తుండటంతో పురుగు నియంత్రణ కష్టమవుతోంది.

నివారణకు వాడాల్సి మందులు:

- మొగిపురుగు నివారణకు వ్యవసాయశాఖ అధికారులు సూచించిన మందులను వాడాల్సి ఉంటుంది.
- ఎకరాకు 8 కేజీలు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు వాడాల్సి ఉంటుంది. లేదా ఎకరాకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 జీ గుళికలను పిచికారీ చేయాలి.
- వరి నారుమడిలో నారు తీసేటప్పుడు గంట ముందు కిలో 4జీ గుళికలు వాడుకోవాలి.
- జింకు లోపాన్ని గుర్తిస్తే 2 కిలోల జింక్ సల్ఫేట్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఇబ్బందులు పడుతున్నాం

మొగిపురుగుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వివిధ రకాల మందులు పంటకు పిచికారీ చేస్తున్నాం. పంటకు పురుగు సోకకుండా ఉండేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

– బ్రహ్మేందర్, రైతు, జిన్నారం

అవగాహన కల్పిస్తున్నాం



వరి పంటను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. మొగి పురుగు సోకితే రైతులు మాకు సమాచారం తెలిపాలి. మేము సూచించిన మందులు వాడుతుంటే పురుగును నివారించవచ్చు. ఎలాంటి సందేహాలు ఉన్నా మమ్మల్ని సంప్రదించాలి.

– రవీంద్రనాథ్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి, జిన్నారం

గంజాయి బ్యాచ్ అరాచకాల వార్తలో నిజం లేదు

హుస్నాబాద్: ఇరువర్గాల గొడవను గంజాయి బ్యాచ్ అరాచకాలుగా ఫేక్ న్యూస్ సృష్టించి వాట్సాప్‌లలో పంపిస్తున్నారని, గంజాయి బ్యాచ్ ఆగడాలు వార్తలో నిజం లేదని ఎస్‌ఐ శ్రీధర్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుస్నాబాద్ పట్టణంలో శుక్రవారం ఇల్లందుల మల్లయ్య, ఆయన తోడల్లుడు ఎలకంటి రాము కారులో వెళ్తున్నారు. ఫ్రండ్స్‌మార్ట్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న సమయంలో హీనాలవ్ రోడ్డు దాటుతున్నాడు. వేగంగా వస్తున్న కారును చూసి నిదానంగా వెళ్లాలని దురుసుగా చెప్పడంతో ఇరువురు గొడవపడ్డారు. వెంటనే హీనాలవ్ తన స్నేహితులు హుమ్మర్, హుస్సేన్, అడావ్‌కు ఫోన్ చేసి సంఘటనా స్థలానికి రావాలన్నాడు. అందరూ కలిసి దాడి చేయడంతో మల్లయ్య గాయపడ్డాడు. తనపై నలుగురు దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా ఈ విషయంలో ఎవరూ గంజాయి సేవించలేదని, గంజాయి బ్యాచ్ అరాచకాలని తప్పుడు వార్త సృష్టించి వైరల్ చేయడం మంచిది కాదన్నారు. ప్రజలు ఇటువంటి వార్తలను నమ్మవద్దని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

రోడ్డుపై కారు టైరు మారుస్తుండగా..

- గుర్తు తెలియని వాహనం ఢీ
- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు
- చికిత్స కోసం ఆస్పత్రులకు తరలింపు



క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

పటాన్‌చెరుటౌన్: కారు టైరు మారుస్తుండగా వెనుక నుంచి ఓ గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ కొంపల్లికి చెందిన ప్రదీప్ గోయాంక(64) శనివారం తెల్లవారుజామున ఎల్బీనగర్ నుంచి మేడ్చల్‌కు చింతల్‌కు చెందిన డ్రైవర్ ఓం ప్రకాశ్‌తో కలిసి కారులో బయలుదేరాడు. దారి తెలియక డ్రైవర్ పటాన్‌చెరు మండల పరిధి పోచారం సమీప రింగ్ రోడ్డులో కారు వేగం తగ్గించాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన డీసీఎం వాహనం కారును ఢీకొట్టడంతో కారు టైర్ బ్లాస్ట్ అయ్యింది. దీంతో డీసీఎం డ్రైవర్ మోతీరామ్ వాహనాన్ని పక్కన నిలిపి, కారు వద్దకు వచ్చాడు. కారు డ్రైవర్ ఓం ప్రకాష్, డీసీఎం డ్రైవర్ మోతీరామ్ కారు టైరు మారుస్తున్నారు. ప్రదీప్ గోయాంక రహదారిపై నిలబడి చూస్తున్నాడు. ఆ సమయంలో గుర్తుతెలియని వాహనం అతడిని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందగా ఓంప్రకాశ్, మోతీరామ్ గాయపడ్డారు. చికిత్స కోసం ఓంప్రకాష్‌ను సనత్ నగర్ ఈఎస్‌ఐ ఆస్పత్రికి తరలించగా, మోతీరామ్‌ను యశోద ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మోతీరామ్ స్వస్థలం సిద్దిపేట జిల్లా అక్కపేటగా గుర్తించారు.

వ్యక్తి అదృశ్యం



రాములు (ఫైల్)

పటాన్‌చెరుటౌన్: ఐస్‌క్రీమ్ కంపెనీకి వెళ్లి వస్తానని వెళ్లి వ్యక్తి కనిపించకుండాపోయాడు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరుకు చెందిన రాములు మండల పరిధిలోని ముత్తంగి ఐస్‌క్రీమ్ కంపెనీకి చెందిన ఐస్‌క్రీమ్‌లు అమ్ముతుంటాడు. ఈనెల 27వ తేదీ ఉదయం కంపెనీకి వెళ్లి వస్తానని భార్య మహేశ్వరికి చెప్పి వెళ్లాడు. అదేరోజు సాయంత్రం అతడికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో భార్య కంపెనీలో పనిచేసే ప్రశాంత్‌కి ఫోన్ చేయగా శనివారం ఉదయం 9 గంటలకు ఓ వ్యక్తి రాములును ముత్తంగి మసీదు వద్ద బైక్‌పై డ్రాప్ చేసినట్లు తెలిపాడు. రాములు కోసం కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువులను విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. భర్త అదృశ్యంపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి మృతి



ఖాజామియా మృతదేహం

కోహీర్(జహీరాబాద్): రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన కోహీర్ శివారులో శనివారం చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు ఖాజామియా కర్ణాటక రాష్ట్రం బీదర్ నివాసి. కొంత కాలంగా కోహీర్‌లో ఉంటున్నాడు. జీవనోపాధి కోసం పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. ఉదయం పశువులను తోలుకొని వెళ్లిన ఖాజామియా కోహీర్, పోతిరెడ్డిపల్లి రైల్వే క్రాసింగ్ సమీపంలో రైలుకింద పడి మరణించాడు. రైలు ఢీకొనడంతో తల గుర్తుపట్టని రీతిలో నుజ్జు అయింది. సుమారు 50 మీటర్ల దూరం వరకు మృతదేహాన్ని ఈడ్చుకుపోయింది. పశువులను తోలే క్రమంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొందా లేక తానే రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే కోణంలో రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ ..

నారాయణఖేడ్: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఖేడ్ ఈత్వార్‌పేటకు చెందిన బిపాష (45) శనివారం ఇంట్లో పనిచేస్తోంది. విద్యుత్ వైరును తాకడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడింది. కుటుంబీకులు ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకుని మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతున్న రైతు ..



నాగరాజు (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా ట్రాక్టర్ తిరగబడటంతో రైతు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన రంగాయపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామానికి చెందిన దానప్ప నాగరాజు (35) వారం క్రితం వర్గల్ మండలం అంతగిరిపల్లిలో పొలం దున్నుతున్న క్రమంలో ట్రాక్టర్ బోల్తాపడటంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం అతడిని గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

కాలిన మృతదేహం లభ్యం



కొమురయ్య మృతదేహం

మునిపల్లి (అందోల్): కాలిన మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. శనివారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి బుదేరా శివారులో కాలిన మృతదేహం గొల్ల కొమురయ్య (40)గా గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు పంచనామ నిర్వహించి కేసు నమోదుచేశారు. సంగారెడ్డి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సంతోష్‌కుమార్, ఎస్‌ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది.

ముగ్గురు నిందితుల అరెస్ట్

తూప్రాన్: హత్యకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సురేశ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలం తిప్పాపూర్ గ్రామానికి చెందిన గొడుగు నరేశ్(28) ఈనెల 21వ తేదీన కనిపించకుండా పోయినట్లు భార్య మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నరేశ్ స్నేహితులు ఆబోతు మల్లేశ్, తిప్పాపూర్‌కు చెందిన హమీద్ అలియాస్ నవీన్‌ను అనుమానంతో విచారించారు. మహిళలతో సన్నిహితంగా ఉంటున్నాడని నరేశ్‌పై కక్ష పెంచుకున్నారు. ఎలాగైనా అతడిని అంతం చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు పట్టణానికి చెంది న పర్శ మల్లేశ్ సహాయం తీసుకున్నారు. నరేశ్ తో కలిసి పట్టణ సమీప గడ్డమోలా బండవద్ద మద్యం తాగారు. పథకం ప్రకారం నరేశ్‌ను హత్య చేశారు. అనంతరం సమీపంలోని పాడుబడిన బావిలో మృతదేహాన్ని, అతడి బైక్‌ను పడేశారు. నిందితులు నేరాన్ని అంగీకరించడంతో అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోశాలలో కోడెల మృతి

చేగుంట(తూప్రాన్): అక్రమంగా తరలిస్తూ సిద్దిపేటలో పట్టుబడిన పశువులను మాసాయిపేట గోశాలకు తరలించగా వాటిలో మూడు కోడెలు శనివారం సాయంత్రం మృతి చెందాయి. అక్రమంగా తరలిస్తుండగా 43 పశువులను సీపీ శ్వేత మాసాయిపేట గోశాలకు తరలించారు. ఇందులో మరో పది పశువులు అనారోగ్యానికి గురయ్యాయి. అనారోగ్యంతో ఉన్న పశువులకు స్థానిక పశువైద్యాధికారి కావ్య చికిత్స నిర్వహిస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



నర్సింలు మృతదేహం

నిజాంపేట(మెదక్): చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన నిజాంపేట మండల పరిధిలోని తిప్పన్నగుల్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన వడ్డే నర్సింలు(38) రెండు నెలల క్రితం వచ్చి మండలంలోని తిప్పన్నగుల్ల గ్రామంలోని షౌకత్‌పల్లి జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం చేపల వేటకు తిప్పన్నగుల్ల గ్రామంలో ఐదర్‌చెరువు వెళ్లాడు. వేటకు వెళ్లి ఎంతసేపైనా రాకపోవడంతో అతడి భార్య లక్ష్మి చెరువు వద్ద వెళ్లి వెతికింది. అక్కడ చెప్పులు, బట్టలు కనబడటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. స్థానికులతో కలిసి వెతకడంతో మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డిటౌన్ : ఆర్థికంగా వెనుకబడిన మహిళల నుంచి ఎంప్లాయిమెంట్ జనరేషన్ మార్కెటింగ్ మిషన్ ద్వారా ఇచ్చే ×సెక్యూరిటీ సూపర్ వైజర్స్ శిక్షణ రెండో బ్యాచ్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా మేనేజరు ఎం. సుగుణ శనివారం తెలిపారు. ఇందుకు ఉమ్మడి జిల్లా పరిధి మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల గ్రామీణ ప్రాంతాలకు చెందిన 18 నుంచి 35 సంవత్సరాలవారు అర్హులన్నారు. శిక్షణ కాల పరిమితి మూడు నెలలని, అభ్యర్థులు ఇంటర్ ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందని తెలిపారు. అభ్యర్థినుల భద్రతకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. శిక్షణ తర్వాత ఉద్యోగం కల్పించబడుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 30 వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంగారెడ్డి బైపాస్‌లోగల జిల్లా మేనేజరు, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం) వారి కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. ddugkyard@gmail.com కు మెయిల్ ద్వారా కూడా దరఖాస్తు పంపవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు ఎస్ఎస్‌సి, ఇంటర్ మెమో, ఆధార్ కార్డ్, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌తోపాటు ఆరు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు సమర్పించాలన్నారు.పూర్తి వివరాలకు 94902 42789, 90140 09791, 97030 39541 ఫోన్ నంబర్స్‌లో సంప్రదించవచ్చన్నారు. శిక్షణ కార్యక్రమం ఫిబ్రవరి 1 తేదీ నుంచి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, 35 మందికి మాత్రమే అవకాశముందని తెలిపారు. మొదట దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు.

పని ఇప్పిస్తానని చెప్పి..

- మహిళకు మద్యం తాగించి
- నగలతో ఉడాయించిన కిలేడీ' అరెస్ట్
- నాచారం టెంపుల్ వద్ద ఘటన

వర్గల్(గజ్వేల్): పని ఇప్పిస్తానని చెప్పి మహిళకు మద్యం తాగించి ఆమె మెడలోని బంగారు నగలు అపహరించుకుపోయిన కిలాడి చివరకు కటకటాల పాలైంది. ఈఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గుట్ట వద్ద జరిగింది. వర్గల్ మండలం గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగుకు చెందిన మేకల శారద(41) కూలి పనులు చేస్తోంది. ఆమె వద్దకు ఈనెల 24వ తేదీన గుర్తుతెలియని మహిళ వచ్చి సిద్దిపేట జిల్లా నాచారం గుట్ట వద్ద ఫంక్షన్ ఉందని, కూరగాయలు తరిగేందుకు ఆడ పనిమనిషి కావాలని, సరైన కూలీ ఇస్తానని నమ్మించి తనవెంట ఆటోలో నాచారం గుట్టకు తీసుకొచ్చింది. అక్కడ వైన్స్ దగ్గర మందు తాగించింది. నిద్ర మత్తులోకి జారుకున్న బాధితురాలు మేకల శారద మెడలోని రెండు తులాల బంగారు పుస్తెలతాడు, పావుతులం చెవికమ్మలు తీసుకుని ఉడాయించింది. శారదకు మెలకువ వచ్చి చూసుకుంటే తన పుస్తెలతాడు, చెవికమ్మలు కనిపించకపోవడంతో లబోదిబోమన్నది. వెంటనే గౌరారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలో కనపడిన మహిళను బాధితురాలికి చూపించారు. ఆ మహిళ గతంలోనూ గౌరారం పీఎస్ పరిధిలో ఇదే తరహా చోరీకి పాల్పడిన మేడ్చల్-రంగారెడ్డి జిల్లా గాజుల రామారానికి చెందిన కైరంకొండ లక్ష్మీసంతోషి(38)గా గుర్తించారు. శనివారం నాచారం గుట్ట వద్ద నిందితురాలు లక్ష్మీ సంతోషి అనుమానాస్పదంగా కన్పించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఆమె నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

అంత్యక్రియలకు హాజరై తిరిగి వెళ్తూ..

- చెట్టుకు ఢీకొట్టిన బైక్
- ఒకరు మృతి, మరొకరి తీవ్ర గాయాలు



చెట్టును ఢీకొన్న బైక్ (ఇన్ సెట్లో) మృతి చెందిన నర్సింలు

కొల్చారం(నర్సాపూర్): బంధువు అంత్యక్రియలకు హాజరై బైక్‌పై తిరిగి వెళ్తూ చెట్టును ఢీ కొట్టుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కొల్చారం మండలం రంగంపేట గ్రామ శివారులోని మెదక్-జోగిపేట ప్రధాన రహదారిపై శనివారం చోటుచేసుకుంది. కొల్చారం ఏఎస్‌ఐ తారాసింగ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. టేక్మాల్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మృతుడు మంగలి నర్సింలు(38), ఎనగండ్ల గ్రామానికి చెందిన బంధువు మంగలి లింగంతో కలిసి బైక్‌పై మండంలోని తుక్కాపూర్‌కు బంధువు అంత్యక్రియలకు హాజరయ్యారు. అంత్యక్రియల అనంతరం ఇద్దరూ కలిసి అదే బైక్‌పై ఎనగండ్ల గ్రామానికి ప్రయాణమయ్యారు. బైక్ అదుపు తప్పడంతో గంగంపేట శివారు ప్రధాన రహదారి పక్క మర్రి చెట్టుకు ఢీ కొట్టడంతో నర్సింలు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ప్రైవేటు అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మెదక్ ఆస్పత్రిలో లింగం చికిత్స పొందుతున్నాడు. మృతుడు నర్సింలుకు భార్య యశోద, కూతురు, కుమారుడు ఉన్నారు.మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

ఆటో బైక్ ఢీ: ముగ్గురికి గాయాలు



గాయపడినవారిని అంబులెన్స్‌లో తరలిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎదురెదురుగా బైక్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు గాయపడిన వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని లింగుపల్లి గ్రామానికి చెందిన జోగ్యారి నర్సింహులు శనివారం తన పొలానికి బైక్‌పై వెళుతున్నాడు. ఈ క్రమంలో చెప్యాల క్రాస్ రోడ్డు నుంచి మిరుదొడ్డికి వస్తున్న ఆటో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఆటోలో ప్రయాణిస్తున్న లింగుపల్లి గ్రామానికి చెందిన ముత్యాలు, అమృత, నర్సింహులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మిరుదొడ్డి పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. కాగా నియోజకవర్గ పర్యటనలో భాగంగా అటుగా వెళుతున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు తన కారును ఆపి సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు, స్థానికుల సహాయంతో గాయపడ్డ ముగ్గురిని అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిని మెరుగైన వైద్యం అందించాలని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులకు ఫోన్ చేసి చెప్పారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



ఈశ్వరయ్య మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నంకరంపేటకు చెందిన వడ్డె ఈశ్వరయ్య(45) టీవీఎస్‌పై పొలానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. అంబాజీపేట బ్రిడ్జి వద్ద మెదక్ నుంచి వస్తున్న కారు ఢీ కొనడంతో తలకు తీవ్రగాయలయ్యాయి. వెంటనే మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడి భార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు అజాగ్రత్తగా కారు నడిపి ప్రమాదానికి కారణమైన కారు యజమాని సాయిలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స కోసం తరలిస్తుండగా..



పోచయ్య (ఫైల్)

పాపన్నపేట(మెదక్): ఎదురెదురుగా బైక్‌లు ఢీ కొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యలో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామానికి చెందిన మంగలి పోచయ్య (44) వ్యవసాయం చేస్తున్నాడు. ఈనెల 26వ తేదీ రాత్రి బంధువు పండరితో కలిసి బైక్‌పై కూరగాయల కోసం మండలంలోని ఎన్కేపల్లికి బయలు దేరాడు. ఈ క్రమంలో రంగంపేట నుంచి పాపన్నపేట వస్తున్న మరో బైక్ ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో పోచయ్య, పండరీ కిందపడటంతో గాయపడ్డారు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు సంఘటనాస్థలికి చేరుకుని పోచయ్యను చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెదక్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం శుక్రవారం రాత్రి గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పోచయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య దుర్గమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లైటింగ్ పోల్‌ను ఢీకొన్న టిప్పర్

డ్రైవర్‌కు తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు



క్షతగాత్రుడిని నిమ్స్‌కు తరలిస్తున్న 108 సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: రహదారి మధ్యలో ఉన్న లైటింగ్ పోల్‌ను టిప్పర్ ఢీకొనడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు మండలం పోచారం సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వెళ్తున్న టిప్పర్ లారీ శనివారం తెల్లవారుజామున పోచారం సమీపంలోని రహదారి మధ్యలో ఉన్న లైటింగ్ పోల్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో డ్రైవర్ సహనవాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసి పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు.